

మిరప రైతు కంట కన్నీరు...

- దిగుబడి తగ్గి, ధరలు పతనమై..!
- మిరపను ధ్వంసం చేసిన నల్లి, తెల్లదోమ
- సినిమా పరిశ్రమపై ఉన్న ప్రేమ రైతుపై లేదేంటి..?



మిరపను చూపుతున్న రైతు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

ఆరుగాలం కష్టపడి పండించిన మిరప పంట దిగుబడి తగ్గింది, సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పండించిన పంటను దళారులకు అమ్ముకోవడంతో తీవ్రంగా రైతులు నష్టపోతున్నారు. నల్లి,తెల్ల దోమ రూపంలో మిరప పంటలు పూర్తిగా ధ్వంసం చేసింది. పురుగుమందులు, ఎరువులు పెట్టుబడి పెట్టి రైతులు నానా కష్టాలు పడి పండించిన మిరపను దళారులు మాటు వేసి దోచుకుంటున్నారు. సినీ పరిశ్రమ పెద్దలు కోరిన వెంటనే టికెట్ల రేట్లు పెంచే ప్రభుత్వం, రైతు వ్యథ్యఘోషలు మాత్రం కనపడటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కోడుమూరు మిరప రైతులపై ప్రత్యేక కథనం...

కోడుమూరు మండలం గోరంట్ల, కల్లపరి,ప్యాలకుర్తి, లద్దగిరి, అనుగొండ, అల్లినగరం, ముడుములకుర్తి, పులకుర్తి, వర్కూర్ తదితర గ్రామాలలో సుమారు 400 ఎకరాల్లో మిరప రైతులు సాగు చేశారు. ఎకరా పొలంలో మిరప సాగు చేయాలంటే రూ.లక్షన్నర పైగా ఖర్చు అవుతుంది. మొదట్లో వర్షాలు సకాలంలో కురవడంతో పంటలు ఏపుగా పెరిగాయి. దీంతో రైతులు ఆనందించారు. వారి ఆనందం ఆవిరయింది. మిరప పంట తెగులు సోకి కాయలు కుళ్లిపోవడంతో దిక్కు తోచని రైతాంగం డీలా పడ్డారు. దిగుబడి తగ్గి తాలూకాయితో పంట కోరడానికి ఆసక్తి చూపటం లేదు. కొన్ని చోట్ల మిరప తీసివేసి టమాటాలు నాటుకుంటున్నారు. రైతాంగం మిరప పంటకు నల్లి, తెల్లదోమ ఇలాంటి వైరస్ సోకి ఎన్ని మందులు పిచికారి చేసినా వాతావరణ మార్పులతో బ్లాక్ స్రిప్ ,ఎర్రనల్లి పంటపై తీవ్ర ప్రభావం చూపి కాయ దశలోనే మచ్చ ఏర్పడి కాయ దెబ్బతిని తాలు శాతం పెరిగింది. ఎన్ని మందులు పిచికారి చేసినా వైరస్ చావకపోగా పైరుని పీల్చి పిప్పిచేసి రైతులను కన్నీళ్లు పెట్టించింది. తాలు, మచ్చ ఉందని సాకుతో మార్కెట్లో దళారులు ధరలు తగ్గించేసి రైతు నోట్లో మట్టి కొడుతున్నారు. మిరప సాగు వ్యయ్యం రెట్టింపయింది. విత్తనాలు, రసాయన మందులు, కూలీల ఖర్చులు రైతులకు భారంగా మారి అప్పులు చేశారు. ఇలా కష్టపడి మిరప సాగు చేస్తే తీరా దిగబడి సగానికి సగం పడిపోయి రైతులు దిగాలు పడ్డారు. గతంలో ఎర్రకాయలో తాలు ఏరే వారు ఇప్పుడు తాలూకాయలో ఎర్రకాయ ఏరాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పూత దశలోనే మిర్చి పై వైరస్ కాటు: పూత దశలోనే ఎర్రకాయ రంగు మారి నల్లి తెల్లదోమ వంటి కీటకాలు పంటను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. తెగులు ఆశిస్తుండటంతో రైతులు పురుగు మందులు పిచికారి చేయడం వలన మందుల వ్యాపారులు ఏది చెప్పే అది కొట్టడం వల్ల పెట్టుబడులు తడిసి మోపడయ్యాయి.

పురుగు మందులు వాడినా: తమ పంటను కాపాడుకోవడానికి వారంలో రెండు సార్లు పురుగు మందులు పిచికారి చేసినా ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగులు సోకి కాయలు కుళ్లిపోవడంతో దిక్కు తోచని స్థితిలో రైతాంగం ఉన్నారు.

భారీగా ధరల పతనం : రెండేళ్ల క్రితం క్వింటాం ధర రూ.80 నుంచి రూ.90 వేల వరకు పలికింది. ఈ ఏడాది దారాపు రూ.15 వేలకు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.లక్ష పైగా పెట్టి సాగు చేశారు. ఈ ఏడాది నాణ్యత లేని తేజ రకం ఎకరా రూ.15 , బ్యాడిగ రకం రూ.27 మిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు తేజ రకం రూ.30 వేల వరకు బ్యాడిగా 70 వేల వరకు ధరలు పలికాయి.

సర్కారు నిర్లక్ష్యం: ఈ ఏడాది వైరస్ మూలంగా సరైన దిగుబడి రాలేదు. కనీసం పండించిన అరకొర పంటను అమ్ముకోవడానికి గిట్టుబాటు ధర లేదు. తేజ రకం కింటాలుకు రూ.12నుంచి రూ.15 వేల వరకు పలుకుతోంది. బ్యాడిగ రకం క్వింటాలకు రూ.30 వేల వరకు మించి లేదు. ఎరువుల ధరలు బస్తా పై ప్రస్తుతం రూ.100 నుంచి రూ.200 పెంచడంతో పెట్టుబడి భారం మరింత పెరిగిపోయింది.

అప్పులే మిగులుతాయి

-వీరన్న కల్లపరి



తేజ రకం సాగు చేశాను. ఎకరా పైనే సాగు చేశాను. లక్షపైనే ఖర్చు అయ్యింది. దిగుబడి 5 క్వింటాళ్లకి మించి రాదు. మార్కెట్లో ధర రూ.13 వేల నుంచి రూ.14 వరకు పలుకుతుంది. మిరప తీసేందుకు, గ్రేడింగ్ కు రూ.50 వేల వరకు ఖర్చు అవుతోంది.ఇలాగైతే అప్పులే మిగులుతాయి.

గిట్టుబాటు ధర కల్పించాలి

- మనోహర్ కల్లపరి రైతు సంఘం నాయకులు



తెగుళ్లతో కాయలు కుళ్ళిపోయి తాలు శాతం పెరగడంతో దిగుబడి తగ్గింది. మూడున్నర ఎకరాలలో పంట సాగు చేశాను. రూ.ఆరు లక్షల ఖర్చు అయింది. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలి.


ప్రభుత్వం ఆదుకోవాలి

- పగులయ్య కల్లపరి



గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఎకరాకు రూ.లక్షన్నర దాకా పెట్టుబడి పెట్టి రెండున్నర ఎకరాలకు రూ.ఐదు లక్షలు పెట్టి మిరప పంటను సాగు చేస్తే ప్రస్తుత ధరల వలన పెట్టిన పెట్టుబడులు రాక అప్పులే మిలిగాయి. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి.

సంక్రాంతికి ధరాఘాతం..



చుక్కలనంటుతున్న నిత్యావసరాల ధరలు

పండగలు అంటేనే భయపడుతున్న సామాన్యులు

సంక్రాంతి పండగకు ధరాఘాతం తప్పడం లేదు. నిత్యవసరాల ధరలు చుక్కలనంటడంతో పండుగ చేసుకోవాలంటే సామాన్యులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు అన్నదాతకు పంటల దిగుబడి ఆశించినంతగా రాకపోవడం, గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సంక్రాంతి పండగ కళ తప్పింది. వ్యవసాయం కూడా యంత్రాలతో చేయడం వలన పల్లెల్లో అంత సందడి కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో పశ్చిమ ప్రాంతం నుంచి ప్రజలు వలసలు వెళ్లడం, ఇళ్ల వద్ద ముసలి మూతక మాత్రమే ఉంటున్నారు. ఉమ్మడి జిల్లా... కొంత తెలంగాణా ప్రాంతం ఈ పండగను కీడు పండుగగా భావిస్తారు.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సంక్రాంతి పండుగకు కలకూర వంటలు, గాజరగడ్డతో కూర చేస్తారు. నువ్వులు కలిపిన సజ్జరొట్టెలు చేసుకుని తింటారు. ఎందుకంటే చలి నుంచి తట్టుకునే గుణం ఉండే ఆహారం కావడమే. పిల్లలకు నువ్వు పిండితో స్నానం చేయిస్తారు. ఇది కూడా యాంటీ బ్యాక్టీరియాగా పని చేస్తుంది. అన్నింటికి మించి ఇక్కముందు ముగ్గులు వేస్తారు. గొబ్బెమ్మలు పెడతారు. ఇది వారం రోజుల నుంచి కనబడుతుంది. రెండో రోజు బెల్లం అన్నం పిండి వంటలు, భక్ష్యాలు చేస్తారు. కొత్త పంటలు వస్తాయి వాటితో చేసుకుంటారు. బాగా రుచిగా ఉంటాయి. గాలిపటాలను గాలోకి వదలడం లాంటివి చేస్తారు. ఇవి తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా చేస్తారు. మూడో రోజును కనుమ పండగ ఇది పశువుల పండుగ...పశువులను అలంకరిస్తారు. ఎద్దుల బండ్ల పందాలు, కోళ్ల పందాలు కూడా కొన్ని ప్రాంతాల్లో చేస్తారు. కనుమ పండగ మాంసం, మాసం వంటలు వండుకోవడం చేస్తారు. తొలిపండగా కావడం వల్ల అల్లుళ్లను అత్తారింటికి పిలు స్తారు. కొత్తబట్టలు తెచ్చుకుంటారు. మూడు రోజులిలా సాగుతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా భోగి పండుగ రోజు సజ్జరొట్టెలు, కలగూర కాయలు, పచ్చిపులుసు, బెల్లం అన్నం వండుకుంటారు. అయితే ఈ సంక్రాంతికి సామాన్యులకు ధరాఘాతం తప్పడం లేదు. నిత్యావసరాల ధరలు పైపైకి పెరుగుతుండటంతో పండుగ చేసుకోవాలంటే సామాన్యులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు నగరంలో కిలో శనగ బేడలు రూ.110, బెల్లం రూ.70, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.80గా ఉంది. ఆదోనిలో కంది బేడలు కిలో రూ.180, శనగ బేడలు రూ.120, బెల్లం మైదా పిండి రూ.50, బెల్లం రూ.60 ఉన్నాయి. నంద్యాలలో కిలో శనగ బేడలు రూ.105, బెల్లం రూ.70, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.80గా ఉంది. ఆత్మకూరులో కిలో శనగ బేడలు రూ.100, బెల్లం రూ.80, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి రూ.65 ఉన్నాయి. నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంటిలో పిండి వంటలు చేసుకునేందుకు కనీసం రూ.500 వెచ్చించాల్సి వస్తోంది. దీంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కొందరు ఉన్న దాంతో కొద్ది మొత్తంలో పిండి వంటలు చేసుకుంటుండగా మరికొందరు పాయసంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. మరో వైపు గ్యాస్ ధర కూడా ఆకాశాన్ని అంటుతోంది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.860గా ఉంది. దీంతో చాలా మంది ఇంట్లో స్టవ్ వెలిగించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

వంట నూనెల మంట..

వంట నూనెలు సల సల కాగుతున్నాయి. లీటరు ప్యాకెట్‌పై రూ.20 నుంచి రూ.30 వరకూ ఒక్కసారిగా ధరలు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో దిగుమతి సుంకం పెంచింది. ఈ నేపథ్యంలో ధరలు అమాంతంగా పెరిగాయి. ఇప్పటికే నిల్వ ఉన్న సరుకును కూడా అధిక ధరలకు విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులు నోస్టాక్ బోర్డులు పెట్టి కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. సన్‌ఫ్లవర్ నూనె 15 లీటర్ల డబ్బా ఖరీదు గత వారం వరకు రూ.1,730 ఉండగా తాజాగా అది రూ.2 వేలకు చేరింది. లీటరు ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.125-రూ.130కి ఎగబాకింది. అంటే లీటరుపై రూ.17 నుంచి రూ.23 వరకు పెరిగింది. 15 లీటర్ల పామాయిల్ నూనె డబ్బా ధర వారం క్రితం వరకు రూ.1,530 ఉండగా, ఇప్పుడది రూ.1,730 దాటింది. గతంలో లీటరు పామాయిల్ ధర రూ.95 ఉండగా తాజాగా రూ.115కి చేరింది. లీటరుకు రూ.20 వరకు పెరిగింది. పూజలకు వినియోగించే వివిధ రకాల నూనెల ధరలు కూడా అమాంతంగా పెంచేశారు. మొన్నటి వరకు లీటరు ధర రూ.100 ఉండగా, అవి ఇప్పుడు రూ.125-130కి చేరాయి.

విద్యుత్ భారాలు తగ్గించాలి

- కలెక్టరేట్ ఎదుట భోగిమంటల్లో విద్యుత్ బిల్లుల దహనం



నగరంలో బిల్లుల ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కొత్త ఏడాదిలో ప్రజలపై విద్యుత్ భారాలను మోపడం తగదని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. వెంటనే విద్యుత్తు ఛార్జీల భారాలను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భోగి పండుగను పురస్కరించుకొని తెల్లవారుజామున 6 గంటలకు కర్నూలు నగరంలోని జిల్లా కలెక్టరేట్ వద్ద గాంధీ విగ్రహం ముందు సిపిఎం, సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు తగులబెట్టి నిరసన తెలిపారు. సిపిఐ నగర కార్యదర్శి రామకష్టారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, మహిళా సమాఖ్య జిల్లా, నగర కార్యదర్శులు శ్రావణి రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకష్ణ, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడారు. చంద్రబాబు అధికారంలోకి రాకముందు గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై మోపిందన్నారు. తనకు అధికారమిస్తే ఆ భారాన్ని తగ్గించడంతోపాటు భవిష్యత్తులో ఎలాంటి ఛార్జీలు పెంచబోమనే హామీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, నాలుగు నెలల్లోనే రూ.20వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. బాదుడే బాదుడంటూ వీధి వీధినా తిరిగిన పార్టీ ట్రూ అప్ ఛార్జీల పేరుతో తిరిగి బాది ప్రజలను మోసం చేస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొడతామన్న నాయకులు, నేడు అవే స్మార్ట్ మీటర్లను ప్రజలకు అబద్ధపు సమాచారంతో వినియోగదారుల మెడలకు ఉరి తాళ్ళలా బిగిస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణలను తెచ్చి ప్రజల నడ్డి విరిచిన ఘనత చంద్రబాబుదేనని, వామపక్షాల ఆధ్వర్యంలో ముగ్గురు నాయకుల బలిదానంతో నాటి సంస్కరణలను తిప్పిగొట్టగలిగామన్నారు. అధికారంలో ఉన్నది ఏ ప్రభుత్వమైనా 15 సంవత్సరాల పాటు విద్యుత్ భారాల జోలికి వెళ్ళనివ్వకుండా ఆ ప్రజా ఉద్యమం కృషి చేసిందన్నారు. నేడు అదే బాటలో పాలకుల వైఖరి కొనసాగుతోందని, కార్పొరేట్ల భోజ్యం కోసం కృషిచేసిన వైసిపి సన్నాయి నొక్కులు నొక్కుతూ ప్రజా ఆందోళనలకు దూరంగా ఉంటోందన్నారు. సెకీ ఒప్పందాల రచ్చ ప్రపంచమంతా చర్చ జరిగినా, నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా ఎవరికివారు తేలు కుట్టిన దొంగల్లా ఉన్నారన్నారు. ప్రజలపై వేసిన, వేయబోతున్న విద్యుత్ భారాలను రద్దు చేయకపోతే ప్రజలంతా ఐక్యమై తిరగబడే రోజు ఎంతో దూరంలో లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నగర అధ్యక్షులు రామాంజనేయులు, వ్యకాసం, కెవిపిఎస్, డివైఎఫ్ఐ, ఆర్‌విఎస్, కెజిబిఎన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు కెవి నారాయణ, ఎండి ఆనంద్ బాబు, వై నగేష్, సి గురు శేఖర్, ఎన్‌జి కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు రంగప్ప, సాయి ఉదయ్, ప్రజా సంఘాల నాయకులు నరసింహ, ఎల్లా గువేరా, శేషాద్రి మునిస్వామి, రామకృష్ణ, కృష్ణ వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : సిపిఎం ఓర్వకల్లు మండల కార్యదర్శి బి.నాగన్న కేతవరం ఓర్వకల్లు శాఖ కార్యదర్శులు జి.శ్రీధర్, వి సుధాకర్ డిమాండ్ చేశారు. ఓర్వకల్, కేతవరం గ్రామాలలో కరెంటు చార్జీలను తగ్గించాలని భోగిమంటల్లో కరెంటు బిల్లును కాల్చివేసి నిరసన తెలిపారు.

కర్నూలు కార్పొరేషన్: కర్నూలు నగరంలోని 23వ వార్డు శ్రీరామ్ నగర్ సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని,స్మార్ట్ మీటర్లుపెట్టేవిధానాన్ని మానుకోవాలని కోరుతూ భోగిమంటలో కరెంటు బిల్లులు వేసి తగలబెట్టి నిరసన తెలిపారు. కె.నాగేంద్ర అచారి అధ్యక్షతన నిర్వహించిన నిరసనలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు మాట్లాడారు.

కర్నూలు కార్పొరేషన్: విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ఇతర ఛార్జీలను తగ్గించాలని ,అదాని సెకీతో చేసుకున్నఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో జోహరాపురం హమాలి హాజరు పాయింట్ దగ్గర బిల్డింగ్ వర్కర్ నాయకులు నాగరాజు అధ్యక్షతన సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయరామాంజనేయులు ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు.

సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్ఎండి షరీఫ్, డి.అబ్దుల్ దేశాయ్‌ల నాయకత్వంలో కర్నూలు అంబేద్కర్ సర్కిల్ , మండి బజార్ సర్కిల్ లో భోగి మంటలలో విద్యుత్ బిల్లుల దహనం చేశారు. నిరసనలకు శ్రీనివాసులు, రాంబాబు అధ్యక్షతన వహించారు.

కర్నూలు క్రైమ్: రాష్ట్ర ప్రభుత్వం సర్ ఛార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి రాఘవేంద్ర అన్నారు. కర్నూలు మండలం ఉంచాల గ్రామంలో భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను కాల్చి నిరసన తెలిపారు. స్థానిక విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: సిపిఎం ఆధ్వర్యంలో కోడుమూరు విజయ భాస్కర్ రెడ్డి సర్కిల్‌లో సిఐటియు మండల కార్యదర్శి జి పి వీరన్న అధ్యక్షతన విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేసిన నిరసన తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి కామర్తి రాజు మాట్లాడారు.

పత్తికొండ: కూటమి ప్రభుత్వం పెంచిన గృహ వినియోగదారుల విద్యుత్ బిల్లులను భోగి మంటలో తగులబెట్టి సిపిఎం పత్తికొండ మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జగ్జీవన్‌రామ్ కాలనీలోని గృహ వినియోగదారులతో కలిసి సిపిఎం నాయకులు భోగిమంటలోని కరెంట్ బిల్లులు కాల్చివేశారు.

గూడూరు: పెంచిన విద్యుత్ ఛార్జింగ్ తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ఆదానితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఎం గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జె.మోహన్ ఆధ్వర్యంలో భోగి పండుగ సందర్భంగా విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో పెంచిన విద్యుత్ బిల్లులను దహనం చేశారు.

పేదలకు సంక్రాంతి కానుకలు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

మానవసేవే మాధవసేవగా భావించి కుల, మతం ప్రాంత బేధం లేకుండా ప్రజలకు సేవ చేయవలసిన అవసరం ఉందని నిఖిలేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మద్దిలేటి చెప్పారు. సోమవారం కర్నూలు నగరంలోని నిఖిలేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో నిరుపేదలకు సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. మద్దిలేటి మాట్లాడుతూ పేదలకు దాన ధర్మాలు చేయడమే మానవత్వానికి మరోపేరు అని, నిరుపేద కుటుంబాలలో సంక్రాంతి సంబరాలు వెల్లి విరిసేలా ఈ చిన్ని కానుక ఇస్తున్నామన్నారు. మానవసేవే మాధవ సేవ అని డబ్బు ఇచ్చే కన్నా అన్నదానం చేయడం గొప్పదన్నారు. సీనియర్ న్యాయవాది చిన్నయ్య, పాస్టర్ రవి, రోజా మహిళ ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత పాల్గొన్నారు.



పేదలకు సంక్రాంతి కానుక అంజేస్తున్న మద్దిలేటి

నేడు బాలసాయి జన్మదిన వేడుకలు

-ఉచిత వైద్య శిబిరం, సేవ, పూజ కార్యక్రమాలు
-బాలసాయి మేనేజింగ్ ట్రస్టీ రామారావు వెల్లడి


ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



బాలసాయి జన్మదిన వేడుకలు ప్రపంచ శాంతి సదస్సు కార్యక్రమం మంగళవారం ప్రత్యేక పూజలతో ప్రారంభం అవుతుందని బాలసాయి మేనేజింగ్ ట్రస్టీ రామారావు తెలిపారు. ప్రతి ఏడాది బాలసాయి జన్మదినాన్ని పురస్కరించుకుని బాలసాయి ఆశ్రమం శ్రీ నిలయంలో ఉదయం 7 గంటల నుండి సేవా కార్యక్రమాలు, పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓమ్ని, ఆర్యా, అమ్మ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బిపి, షుగర్, ఇసిజి, బోన్ టెస్టు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, అందరికి ఉచిత మందులు పంపిణీ చేస్తా మన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నటరాజ నృత్య కళామందిర్ బృందంచే కూచిపూడి, జానపద, భరతనాట్యం, పేరిణి, కథక్ నాట్య ప్రదర్శనలు , అన్నమ్మయ్య సంకీర్తనలు, భక్తి పాటలు ఉంటాయన్నారు. ఈ పూజ ,సేవ కార్యక్రమాలలో ఎంపిలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పాల్గొంటున్నారని భక్తులకు, ప్రజలకు మధ్యాహ్నం 1 గంటకు అన్నప్రసాదం వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. నగర ప్రజలు అందరు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వైసిపి జిల్లా కార్యదర్శిగా పెద్ద ఈశ్వరయ్య

కాటసాని రాంభూపాల్ రెడ్డిని సన్మానించిన ఈశ్వరయ్య బృందం



ఈశ్వరయ్యకు స్వీటు తినిపిస్తున్న రాంభూపాల్‌రెడ్డి

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

వైసిపి కర్నూలు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చెందిన కురువ పెద్ద ఈశ్వరయ్యను నియమించారు. దీంతో మండలంలోని నాయకులు కార్యకర్తలతో కలిసి కురువ పెద్ద ఈశ్వరయ్య చెన్నమ్మ సర్కిల్లోని వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి పూలమాలతో సత్కరించారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ నాయకులు , కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా ప్రజలకు కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ అభిమానులకు , శ్రేయోభిలాషులకు కర్నూలు డిసిసి అధ్యక్షులు పి.మురళీకృష్ణ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాలలో రైతులు ఏడాదంతా కష్టపడి పండించిన పంటలు సంక్రాంతికి ఇంటికి వచ్చి ప్రతి ఇల్లు ధాన్యపు రాశులతో కలకలలాడు తుంటాయన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయక పోవడంతో పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలలో తీవ్ర నిరాశతో ఉన్నారని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక పోవడం వలన ఇబ్బందులు పడుతు న్నారని, మూలిగేనక్కపై తాటికాయ పడిన చందాన విద్యుత్ ట్రూ అప్‌ఛార్జీల రూపంలో సామాన్య ప్రజలపై అధనపు భారాలు మోపా రన్నారు. విద్యుత్ భారాలు వేయబోమని చెప్పిన చంద్రబాబు ఇచ్చిన హామీని విస్మరించాలర్నారు.

సిరి సంపదలు సుఖ సంతోషాలనిచ్చే సంక్రాంతి

ఎస్‌వి దంపతులు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

మాజీ ఎమ్మెల్యే, వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షులు ఎస్ వి విజయ మనోహరి , యువ నాయకులు ఎస్‌వి జనక దత్తారెడ్డిలు తమ స్వగహం వద్ద భోగి పండుగను పురస్కరించుకొని బోగి మంటతో సంబరాలను ప్రారంభించారు. ఎస్‌విమోహన్‌రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో వచ్చే తొలి పండుగగా సంక్రాంతిని ప్రజలు నిర్వహించుకుంటారని, ఈ పండుగ మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. ఈ పండుగ గ్రామీణ ప్రాంతాలలో రైతులు పండించిన పంటలు రావడంతో పాటు నగరాలలో స్థిర పడిన ప్రజలు కూడా పెద్ద ఎత్తున గ్రామ ప్రాంతాలకు తరలి వెళ్లి తమ కుటుంబ సభ్యులతో జరుపుకునే ఏకైక పండుగ సంక్రాంతి అని అన్నారు. ఈ సంక్రాంతి పండగ అందరి ఇళ్లలో ఆనందాలను నింపాలని ఆకాంక్షించారు. వైసిపి జిల్లా కార్యదర్శి షరీఫ్, కోశాధికారి కల్లా నరసింహ రెడ్డి, సెక్రెటరీ సర్వేశ్వర రెడ్డి, పత్తా బాషా, కల్లా నాగవేణి రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు, ఎస్‌వి యూత్ పాల్గొన్నారు.




ఎస్‌వి మోహన్‌రెడ్డి నివాసంలో భోగి పండగ సంబరాలు

సంబరంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

-ముగ్గుల పోటీలలో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు
-15వ బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : కర్నూలు నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో డివిఆర్ బ్రాడ్‌బ్యాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల ముగ్గుల పోటీలను రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి ప్రారంభించారు. సంక్రాంతి పర్వదిన ప్రాధాన్యతను వివరిస్తూ గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు, హరిదాసుల కార్యక్రమం అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిరుచులకు తగిన విధంగా ముగ్గులు వేసి విజయవంతం చేశారు. మహిళలు వేసిన ముగ్గులను టిజివి దంపతులు పరిశీలించి మహిళలను అభినందించారు. డివిఆర్ బ్రాడ్‌బ్యాండ్ అధినేత డి.వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ ,రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మార్గదర్శనంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. గతంలో 2020 సంవత్సరంలో కూడా తమ సంస్థ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశామని వివరించారు. ఈనెల 15న సాయంత్రం 5 గంటలకు జరిగే ముగ్గుల పోటీల బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో అతిథులు బహుమతులను ప్రదానం చేస్తారని వివరించారు. ముగ్గుల పోటీలలో 1000 మంది మహిళలు పాల్గొన్నారని, పాల్గొన్న ప్రతి ఒక్కరికి మూడు లీటర్ల రైస్ కుక్కర్ అందజేస్తామని చెప్పారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి మొదటి బహుమతిగా ఓపెన్ ప్లాట్, రెండో బహుమతిగా ఈ బైక్, మూడో బహుమతిగా సోఫాసెట్, నాలుగో బహుమతిగా పావుకిలో వెండితో పాటు మరో 30 బహుమతులను అందజేస్తామని చెప్పారు. గతంలో జిల్లా స్థాయిలో ముగ్గుల పోటీల నిర్వహించామని, ఈసారి కర్నూలు మహిళలను దృష్టిలో ఉంచుకొని కర్నూలు నగరంతో పాటు పది కిలోమీటర్ల పరిధిలో ఉన్న వారిని మాత్రమే పాల్గొనేలా పోటీలు నిర్వహించామని వివరించారు. ఈనెల 15న బహుమతుల ప్రదానం అనంతరం సాంస్కతిక కార్యక్రమాలు జబర్దస్త్ కళాకారులచే వినోద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. యాంకర్ రష్మి గౌతమ్ ,యాంకర్ దీప్తి నల్లమోతు, సింగర్లు హనుమాన్, సాయిశిల్ప, జబర్దస్త్ కళాకారులు కెవ్వు కార్తీక్ ,వినోద్, శాంతి స్వరూప్, నూకరాజు, రాము, ప్రవీణ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. డివిఆర్ సిటీ డిజిటల్ జనరల్ మేనేజర్ ఎస్.కె మహేష్ మాట్లాడుతూ ఏ కార్యక్రమం చేపట్టి సక్సెస్ ఫుల్‌గా చేయడం డివిఆర్ గ్రూప్ సంస్థల అధినేత డి వెంకటేశ్వర్ రెడ్డికే సాధ్యమని చెప్పారు. ముగ్గుల పోటీల నేపథ్యంలో ఈ ప్రాంగణం పండగ వాతావరణం సంతరించుకుందని వివరించారు .పోటీల్లో పాల్గొన్న వారికి ప్రత్యేక ప్రత్యేక బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులను అందజేస్తామని వివరించారు.



కర్నూలు అవుట్‌డోన్ స్టేడియంలో ముగ్గుల పోటీలకు అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు



స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెడికవర్ ఉచిత వైద్య శిబిరం

- ఎస్‌బిఐ ఆరోగ్య బీమాతో ధీమా - మేనేజర్ నరేష్ బాబు



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల స్టేట్ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఇమ్రాన్ బాష ఆధ్వర్యంలో సోమవారం గోనెగండ్లలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 108 మంది హాజరు కాగా వారిలో 60 మందికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. మిగతా వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారిని పరీక్షించి మందులను ఉచితంగా ఇవ్వడంతో పాటు ఆరోగ్య సలహాలను ఇచ్చారు. మొట్టమొదటిసారి స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి ఇంతమంది హాజరై వైద్య సేవలు పొందడం సంతోషంగా ఉందని మేనేజర్ టి.నరేష్ బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. దీనికోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ఆరోగ్య బీమా పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఒక కుటుంబానికి రూ.11,999 నుంచి కుటుంబంలో ఉన్న సభ్యుల సంఖ్యను, వారి ఆర్థిక స్థితిగతులను బట్టి ఒక సంవత్సరం కాల పరిమితితో మంచి ఆరోగ్య బీమా పథకాలు ఉన్నాయని తెలిపారు. బ్యాంకు అధికారులు జాకోబ్, ఫీల్డ్ ఆఫీసర్ మధుమనోహర్, అకౌంటెంట్ కౌసల్య, సిబ్బంది రాఘవేంద్ర, హుస్సేనప్ప, మెడికవర్ సిబ్బంది బాలు, ప్రశాంత్, ప్రసన్న, మద్దేశ్వరి పాల్గొన్నారు.

ప్రజాహితం కోరే పత్రిక.. ప్రజాశక్తి...

- పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రజా హితం కోరే పత్రిక ప్రజాశక్తి దినపత్రిక అని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు తెలిపారు. సోమవారం ప్రజాశక్తి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, సామాన్యుల వైపు ఉండి ప్రశ్నించే తత్వం ఉంటుందని, ప్రజలందరూ ఆదరించాలని కోరారు. శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సహాయక పిఆర్‌ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్, ఉడిపి రెసిడెన్సి నిర్వాహకులు పరమేష్ స్వామి, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్ రావు, తంబిస్వామి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం

- క్రికెట్ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు రమేష్



క్రికెట్ ఆడుతున్న విట్టా రమేష్

ప్రజాశక్తి - ఆదోని

క్రికెట్ క్రీడాకారులకు అండ గా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామని క్రికెట్ అసోసియేషన్ ఆదోని తాలూకా అధ్యక్షులు విట్టా రమేష్ తెలిపారు. మున్సిపల్ మైదానంలో జరుగుతున్న ఛాంపియన్ ట్రోఫీ టోర్నమెంట్‌లో సోమవారం క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ క్రికెట్ జట్లకు ఎంపికయ్యారని తెలిపారు. క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి అంజలి శర్వాణి జాతీయ జట్టులో స్థానం పొంది ఆదోని పేరును చాటారని చెప్పారు. విద్యార్థి స్థాయి నుంచి ప్రతిభను గుర్తించి ప్రత్యేక కోచ్‌తో శిక్షణ ఇప్పిస్తూ జిల్లా, రాష్ట్ర జట్ల ఎంపికకు సహకరిస్తున్నామన్నారు. ఆర్గనైజర్ ముజీబ్ అహ్మద్ మాట్లాడుతూ... ఆదోనిలో చాలా మంది క్రీడాకారులు ఉన్నారని, వారి ప్రతిభ ప్రదర్శనకు టోర్నమెంట్లు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కోటకొండలో కబడ్డీ పోటీలు



కోటకొండలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని పి.కోట కొండ గ్రామంలో డివైఎఫ్‌ఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా సోమవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో మొదటి బహుమతి హరి టీం, రెండో బహుమతి విన్నర్ గిరి టీం, మూడో బహుమతి హరీష్ టీం గెలిచాయి. మంగళవారం పండగ రోజు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి నాలుగు బహుమతులు అందజేయనున్నట్లు నాయకులు తెలిపారు. రైతుసంఘం, డివైఎఫ్‌ఐ నాయకులు సూరి, సుభాన్, కౌలుట్ల, స్వామి, నాగరాజు, వెన్నెల, మల్లి, రామాంజనేయులు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మాట తప్పిన చంద్రబాబు

- సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ - విద్యుత్ బిల్లులు దహనం చేసి సిపిఎం నిరసన

ప్రజాశక్తి - ఆదోని

అధికారంలోకి రాక ముందు 'బాదుడే బాదుడు' అంటూ నిరసన చేపట్టిన చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే విద్యుత్ చార్జీల భారం మోపడం తగదని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ విమర్శించారు. ట్రూ అప్, సర్దుబాటు విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సోమవారం ఆదోనిలో నిరసన చేపట్టారు. స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, అదాని విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని ఇందిరానగర్‌లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల ప్రతులను దహనం చేశామని వీరేష్, సతీష్, శ్రీకాంత్, మోహన్, జమీర్ తెలిపారు. అలాగే సిఐటియు ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల ప్రతులను దహనం చేశారు. రేణుకాంబ హోటల్ ఆటో స్టాండ్ దగ్గర నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, నాయకులు తిప్పన, కార్యదర్శి పిఎస్.గోపాల్, శంకర్, తోవి బాష, రాము, గౌరీ, ఈరన్న, వీరేష్, స్వామి, రఫిక్, నాగప్ప పాల్గొన్నారు. అలాగే మండలంలోని పాండవగల్లు, కొత్తూరు, దొడ్డనకేరి, ఆరెకల్లు గ్రామాల్లో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి లింగన్న, రామాంజనేయులు, మండల నాయకులు అయ్యప్ప, పాండురంగ, కె.మునిస్వామి, శాఖ కార్యదర్శులు ఎస్.హనీఫ్, కర్ణ, పార్టీ సభ్యులు కృష్ణ, భీమా, తాయన్న, హనుమంతు రెడ్డి, కె.హనుమంతు రెడ్డి పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని తేరుబజారులో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి పి.గోవిందు, పట్టణ కమిటీ సభ్యులు రమేష్, కృష్ణ, సిపిఎం నాయకులు అబ్దుల్లా, పరమేష్, బజారి, శంకర్ పాల్గొన్నారు. **ఆలూరులో** విద్యుత్ చార్జీల బిల్లులను భోగి మంటల్లో వేసి నిరసన చేపట్టారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు విరుద్ధంగా ప్రజలపై మోయలేని భారాలు వేయడం సరికాదని విమర్శించారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ నాయకులు కృష్ణ, మైనా, విఠల్ పాల్గొన్నారు. **పెద్దకడబూరులో** సిపిఎం ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. మండలంలోని కల్లుకుంట, చిన్నతుంబళం, బసలదొడ్డి, పెద్దకడబూరులో విద్యుత్ బిల్లుల పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కన్వీనర్ తిక్కన్న, నాయకులు హనుమంతు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, దేవదాసు, ఈరన్న పాల్గొన్నారు. **హోళగుందలో** సిపిఎం ఆధ్వర్యంలో సంక్రాంతి భోగి మంటల్లో బిల్లుల ప్రతులను దహనం చేశారు. సిపిఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు వెంకటేష్, నాయకులు నాగరాజు, హమాలీ నాయకులు కట్టప్ప, దేవన్న, ఈడిగ రాముడు, ఈడిగ ఈరన్న, వాసప్ప, గురుపాద, ఎం.ఆలం పాల్గొన్నారు.

గోనెగండ్ల : పెరిగిన విద్యుత్ బిల్లుల సర్దుబాటు చార్జీల భారాన్ని రద్దు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో గోనెగండ్లలో విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం శాఖ కార్యదర్శి కరుణాకర్ మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెరుగుదలకు వ్యతిరేకంగా, ట్రూ అప్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని కోరారు. స్మార్ట్ మీటర్లు పెట్టరాదని, అదాని విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. **ఆస్పరిలో** విద్యుత్ చార్జీల బిల్లును భోగి మంటల్లో వేసి నిరసన చేపట్టారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు రంగస్వామి, పెద్ద వీరభద్రి, రవి, రాము, శివ, రాజు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచడం ఏమిటని మండిపడ్డారు.



ఆదోనిలో బిల్లుల ప్రతులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు



ఎమ్మిగనూరులో



పెద్దకడబూరులో నిరసన చేపడుతున్న నాయకులు



హోళగుందలో నిరసన చేపడుతున్న నాయకులు



ఆస్పరిలో...

ప్రజాశక్తి కథనానికి స్పందన

- పశు వైద్యశాల చుట్టూ ముళ్లకంప తొలగింపు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈనెల 6న ప్రజాశక్తి పత్రికలో ప్రచురితమైన 'శిథిలావస్థలో పశువైద్యశాల' అనే కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. సోమవారం నేమకల్లు గ్రామంలోని పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న పశు వైద్యాధికారి మహేష్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పశు వైద్యశాలకు చుట్టూ ఉన్న ముళ్లకంపను జెసిబి ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మహేష్ మాట్లాడారు. పశువైద్యశాల దగ్గరకు పశువులను తోలుకొచ్చే రైతులకు ఏమాత్రం ఇబ్బందులు లేకుండా ముళ్లకంపను తొలగించినట్లు తెలిపారు. పశు వైద్యశాల మరమ్మతులకు కూడా సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరయితే మరమ్మతులు చేపడతామన్నారు.



అప్పుడు...



ఇప్పుడు...

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం : ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు సంక్రాంతి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షులు నాగరాజు హెచ్చరించారు. సోమవారం వారు పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. తరగతులు నిర్వహించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాతర సందర్భంగా అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పరిశీలించారు. సోమవారం పట్టణంలోని తేరు బజారు ఏరియాలో శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.




పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

అంకితభావంతో పని చేస్తే ఎప్పుడూ గుర్తింపే

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

వైసిపికి అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకునే నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి తెలిపారు. సోమవారం చిప్పగిరిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వైసిపి పెద్దలు జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్న అర్థగేరి శ్రీనివాసులు, రెండోసారి వైసిపి కన్వీనర్‌గా ఎన్నుకున్న జూటూరు మారయ్య, హాలహర్వి మండల కన్వీనర్ రామిరెడ్డి, ఎమ్మెల్యే బుసినే విరుపాక్షిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు పూలమాల, శాలువా వేసి ఘనంగా సన్మానించారు. అలాగే పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, పార్టీ పెద్దలకు, జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడారు. పార్టీలో ప్రతి కార్యకర్తకూ గుర్తింపును నిజం చేసే పార్టీ వైసిపి అని తెలిపారు. సాదాసీదా కార్యకర్త అర్థగేరి శ్రీనివాసులును జిల్లా కార్యదర్శిగా ఎన్నుకోవడం నిదర్శనమని చెప్పారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకపోయినా కార్యకర్తలు అధైర్య పడకుండా ముందుకు పోవాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉంటామని, అందరి సహకారం తనకు కావాలని తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతామని, నాయకులతో పాటు ప్రతి కార్యకర్త కూడా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కామినేహాల్ జనార్ధన్ పాల్గొన్నారు.



చిప్పగిరిలో ఎమ్మెల్యే విరుపాక్షిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి మండల కన్వీనర్‌గా బసవరాజు

ఆస్పరి : వైసిపి మండల కన్వీనర్‌గా చిన్నహోతూరు గ్రామానికి చెందిన గూళ్యం బసవరాజును ఎన్నుకోవడం పట్ల వైసిపి మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి మండల నాయకుల ఆధ్వర్యంలో చిన్నహోతూరు గ్రామంలోని బాలుర హాస్టల్‌లో బసవరాజును శాలువా, పూలమాలలతో సన్మానించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విరుపాక్షి హాజరై మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సంక్రాంతి తర్వాత పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి జిల్లాల పర్యటనకు వస్తున్నందున పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం పెరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే విరుపాక్షిని పూలమాలలతో సన్మానించారు. సర్పంచులు హరికృష్ణ, పెద్ది రెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్ గోవర్ధన్, మాజీ సిఇఒ అశోక్, మాజీ సీనియర్ జర్నలిస్టు వెంకన్న, వైసిపి మండల సీనియర్ నాయకులు ప్రకాష్, హనుమంతు రెడ్డి, వెంకట్‌రెడ్డి, శివానంద, చిన్నాయప్ప, మనోహర్ రెడ్డి, శివ, లక్ష్మన్న, సుంకన్న, రంగన్న, నాయుడు, దస్తగిరి, వెంకటేష్, మునిస్వామి, వేణు, ప్రభాకర్ పాల్గొన్నారు.



ఆస్పరిలో బసవరాజును సన్మానిస్తున్న మండల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రైతులకు అండగా 'కూటమి' : టిడిపి

ప్రజాశక్తి - ఆస్పరి

పాడి, పశువుల అభివృద్ధి కోసం మినీ గోకులం షెడ్లు నిర్మిస్తూ రైతులకు అన్ని రకాలుగా అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని టిడిపి ములుగుందం నాయకులు లింగన్న, లక్ష్మన్న, కొండయ్య తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. రైతులు పాడి పంటలు, సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని పెద్దహోతూరు గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న బండరాయిను ఢీకొట్టడంతో బళ్లారికి చెందిన గాజుల చంద్రశేఖర్ (50) తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందారు. బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బళ్లారిలో గాజుల షాప్ పెట్టుకొని జీవనం సాగిస్తున్న గాజుల చంద్రశేఖర్‌కు భార్య నాగమణి, కుమార్తె శవరి ఉన్నారు. సోమవారం తన ద్విచక్ర వాహనం (కెఎ 34 డబ్ల్యు 7331)పై సమీప బంధువు వీరేష్, ఆయన కుమారుడు గీతేష్ పత్తికొండలో ఉన్న పులికొండ రంగస్వామి దర్శనం కోసం బయల్దేరారు. దర్శనం అనంతరం తిరిగి బళ్లారికి వెళుతుండగా పెద్దహోతూరు వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

వైభవంగా రాఘవేంద్రుని నవరత్న స్వర్ణ రథోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో శ్రీరాఘవేంద్రస్వామి నవరత్న స్వర్ణ రథోత్సవం వైభవంగా సాగింది. సోమవారం భోగి పండగ సందర్భంగా శ్రీమఠం ప్రాకారంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమను ఉంచి పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తజన సందోహం మధ్య ఘనంగా ఊరేగించారు.

రాంపురం జాతరకు ఏర్పాట్లు పూర్తి

- 15న రామలింగేశ్వరస్వామి మహా రథోత్సవం - ఆలయ ధర్మకర్త సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రాంపురం గ్రామంలో వెలసిన రామలింగేశ్వరస్వామి జాతరకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ ధర్మకర్త, టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి, యువ నాయకులు వై.ధరణి రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 15న మహా రథోత్సవం ఉంటుందని తెలిపారు. గ్రామంలోని తుంగభద్ర నదీతీరంలో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి మహా రథోత్సవ కార్యక్రమానికి జిల్లాలోని ఎమ్మెల్యేలతో పాటు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొంటారని చెప్పారు. తండ్రి మాటకు కట్టుబడి శ్రీరాముడు అరణ్య వాసం చేస్తూ తుంగభద్ర నదీతీరంలో పర్యటించినట్లు చరిత్ర ఉందన్నారు. శ్రీరాముడిచే ప్రతిష్టించబడిన లింగమే రామలింగేశ్వరుడిగా అవతరించారని తెలిపారు. ప్రతేడాది కనుమ రోజున రామలింగేశ్వరుడి జాతర, మహా రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రథయాత్ర సందర్భంగా ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీప అలంకరణతో కాంతులు వెదజల్లుతోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.



పూర్తయిన ఏర్పాట్లు




మాట్లాడుతున్న సీతారామిరెడ్డి

పాడి రైతులకు బాసటగా 'కూటమి'

- టిడిపి నాయకులు ఖాసీం వలీ, బండే గురుస్వామి

ప్రజాశక్తి - నందవరం

మండలంలో మినీ గోకలాలను అందించి కూటమి ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలిచిందని టిడిపి నాయకులు ఖాసీం వలీ, బండే గురుస్వామి తెలిపారు. సోమవారం మాచాపురం, ఇబ్రహీంపురం గ్రామాల్లో మినీ గోకులం షెడ్లను కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాడి రైతుల అభ్యున్నతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. పశువులకు గోకులాలు లేక వర్షంలో తడుస్తూ, ఎండకు వేడిని తట్టుకోలేక చాలా చోట్ల చనిపోయాయని చెప్పారు. మండలంలో పాడి పరిశ్రమ తగ్గిందని, కూటమి ప్రభుత్వం చేపట్టిన గోకులాల నిర్మాణం పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. పశువులకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ పశువుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని చెప్పారు. ఎపిఒ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, నది కైరవాడి వీరేష్, డబ్బా ఈరన్న, ఉదయ్ గౌడ్, మిట్టసోమాపురం వీరేష్, సత్యరెడ్డి, బజారి, వలీ, వీరారెడ్డి, సామ్యేలు, మారెప్ప, కృష్ణ, బసప్ప, జనసేన నాయకులు యల్లప్ప పాల్గొన్నారు.



గోకులం షెడ్లను ప్రారంభిస్తున్న నాయకులు



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచి రాధమ్మ

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండగ సందర్భంగా ఆస్పరి యూత్ సేవా సమితి సభ్యులు రామకృష్ణ, మహేష్, అరవింద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సర్పంచి మూలింటి రాధమ్మ, కెడిసిసి జిల్లా బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, జడ్‌పిటిసి దొరబాబు, ఎస్‌ఐ నరసింహులు, టిడిపి మండల మాజీ కన్వీనర్ ఎస్.తిమ్మన్న పాల్గొని సోమవారం రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. మొదటి బహుమతి రూ.20,116, రెండో బహుమతి రూ.10,116, మూడో బహుమతి రూ.5,116 అందజేయనున్నట్లు తెలిపారు. 18 జట్లు పేరు నమోదు చేసుకున్నాయని చెప్పారు. టిడిపి నాయకులు సతీష్ కుమార్, రంగనాథ్, రంగన్న, ఆర్గనైజర్లు విజయ్, హేమంత్, నరసప్ప, వీరేష్, అక్బర్, రాజు, రవి, బాలముని పాల్గొన్నారు.

మాల మల్లేష్ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని దైవందిన్నె గ్రామ సమతా సైనిక్ దళ్ రాయలసీమ నాయకులు మాల మల్లేష్ మృతి చెందడంతో సోమవారం ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు పాలేటి మహేశ్వర్, పిల్ల సురేంద్ర బాబు ఆదేశాల మేరకు కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం ఉండాలని ఊరి పెద్దల సమక్షంలో రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి రంగయ్య అందించారు. రానున్న రోజుల్లో మరిన్ని సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. జిల్లా సమతా సైనిక్ దళ్ యూత్ వింగ్ అధ్యక్షులు గుడికల్ నల్లన్న, జిల్లా నాయకులు బలరామ్, రాముడు, మహేష్, తారక్ పాల్గొన్నారు.

నిధులు మెక్కేసిన వారిపై విచారణ చేపట్టాలి

- టిఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు నాగరాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) విభాగంలో ఎస్సీ నిధులు దుర్వినియోగం చేసిన వైసిపి నాయకురాలిపై విచారణ చేపట్టాలని దళిత సంఘం నాయకులు, టిఎన్ఎస్ఎఫ్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దావీదు, కదిరికోట షాలేము, గుడికల్ దేవదాసు, ఎరుకల సూరి, మాదిగ నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మిగనూరు మహిళా సంఘాల పరివర్తన పేరుతో జరిగిన అవినీతి చరిత్ర మరోసారి వెలుగులోకి వచ్చిందని తెలిపారు. గత వైసిపి హయాంలో ప్రారంభమైన ఈ అవినీతి వ్యవహారాలను ఇప్పటి వరకు సరిచేయకపోవడం, తీరా ఆ అవినీతి భాగస్వామికే భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందించడం ప్రజాస్వామ్యానికి మరొక మచ్చగా నిలిచిందని విమర్శించారు. డిఆర్‌డిఎ మెప్మా పీడీగా ఉన్న ప్రస్తుత మహిళా అధికారిణి, వైసిపి హయాంలో నియమించిన మహిళా సంఘ నాయకురాలితో కలిసి ప్రభుత్వ నిధులను దోచేశారని మండిపడ్డారు. మహిళా సంక్షేమం పేరుతో కేటాయించిన నిధులను దారి మళ్లించి, అసలు ప్రయోజనాలేవీ సాధించకపోవడం బాధాకరమని తెలిపారు. షెడ్ల నిర్మాణం పేరిట ఎలాంటి పనులూ చేపట్టకుండా కేవలం కాగితాల మీదే షెడ్లు చూపించి నిధులను అపహరించారని విమర్శించారు. ప్రాంతీయ అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను ప్రయివేట్ వ్యక్తుల ఖాతాల్లోకి మళ్లించారని, కలెక్టర్ దీనిపై విచారణ చేయకుండా పాత రికార్డులను ఎలా అనుమతించారని ప్రశ్నించారు. అప్పటి పాలకులు వీటిని ప్రోత్సహించడం ద్వారా ప్రజల నమ్మకాన్ని కోల్పోయారని, అవినీతికి పాల్పడిన ఆమెకు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం, కలెక్టర్ వెంటనే ఈ వ్యవహారంపై దృష్టి పెట్టి పూర్తి స్థాయిలో పరిశీలించి ఎస్సీ నిధులు దుర్వినియోగం చేసిన వైసిపి నాయకురాలిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న టిఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు నాగరాజు

జనసేన ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నందవరం

సంక్రాంతి సందర్భంగా ఇబ్రహీంపురం గ్రామంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రేఖగౌడ్ ఆధ్వర్యంలో జనసేన మండల అధ్యక్షులు ఎల్లప్ప కబడ్డీ పోటీలు నిర్వహించారు. సోమవారం ఆయన టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్తుల మధ్య క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు క్రీడా సమయంలో మనస్పర్థలకు వెళ్లకుండా స్నేహభావంతో ఆడాలని చెప్పారు. ఈ పోటీలు మూడురోజులు జరుగుతాయని, ఈ టోర్నమెంట్‌లో 13 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. రామప్ప స్వామి, టిడిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, మారెప్ప పాల్గొన్నారు.